

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా పద్మావతి అమ్మవారు

కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్నారు.

– భీమునిపట్నం



భీమిలి రోడ్డులో రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలోని మండపంలో శాకంబరిగా..



బోయపాలెం రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు



అంబేడ్కరు కూడలిలోని ఆటో కార్మికులు ఏర్పాటు చేసిన మండపంలో శాంతిస్వరూపిణిగా..



కుసులవాడ పంచాయతీ రేగానిగూడెంలో అమ్మవారు

అన్నపూర్ణే.. సదాపూర్ణే

- అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత
- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాలలో మూడోరోజైన శనివారం అమ్మవారు పలుచోట్ల శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పదిరోజుల పాటు మండపాలు, ఆలయాల వద్ద భవానీలకు బిక్ష , భక్తులకు అన్నప్రసాదాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. చిట్టివలస గణేష్ థియేటర్ కూడలి వద్ద గురుభవానీలు గురయ్యరెడ్డి, మహేష్, రాజాన ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె, పడిపూజ నిర్వహించారు. సంగివలస కొత్తమ్మతల్లి, బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులోని మండపం వద్ద నిర్వాహకులు రోజూ అన్నదానం ఏర్పాటు చేశారు.

– తగరపువలస



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో అన్నపూర్ణా దేవిగా..

చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు.

– మధురవాడ

గాయత్రీ దేవిగా బబ్బేలమ్మ



కారుషెడ్ కూడలిలోని బబ్బేలమ్మ వారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమార్చనల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

– పీఎం పాలెం



గణేష్ థియేటర్ కూడలి వద్ద నవదుర్గా పీఠం ఆధ్వర్యంలో భవానీల పూజలు



ఆనందపురం బీసీ కాలనీ మండపంలో పరివారంతో కొలువుదీరిన అమ్మవారు



దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

క్లుప్తంగా

గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞానంపై అవగాహన



వైద్య విజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్న న్యూరో ఫిజీషియన్ సునీల్ కుమార్

పద్మనాభం: గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞానంపై మధురవాడ విజయ శ్రీ ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ బి.సునీల్ కుమార్ అవగాహన కల్పించారు. మండల పరిధి కృష్ణాపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫిట్స్, పక్షవాతం వంటి వ్యాధులకు ప్రాథమిక వైద్యం అందించడంపై అవగాహన కల్పించారు. మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు రాలి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి వైద్యులు హాజరయ్యారు.

గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి అభినందన



గోల్డ్ మెడల్ సాధించిన అజయ్

తగరపువలస: గత నెల 27 నుంచి 30 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీ మొదటి సంవత్సరం సీఎస్ఎం విద్యార్థి జి.అజయ్‌కు గోల్డ్ మెడల్ లభించింది. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అజయ్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

అలరించిన స్వరార్చన



స్వరార్చన చేస్తున్న రాగ మ్యూజిక్ అకాడమీ బృందం

మధురవాడ: మిథిలాపురి వుడా కాలనీ బాలాజీ హిల్స్‌లో శ్రీ భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక సంగీత కచేరీ ఆకట్టుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాగా మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకురాలు కావూరి నాగజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ణాటక సంగీత కచేరీ భక్తులను అలరించింది.

మ్యాన్‌హోల్స్ నుంచి భరించలేని దుర్గంధం



కొమ్మాది వైఎస్సార్ నగర్ 9వ బ్లాక్‌లో పరిస్థితి

తగరపువలస: జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది వైఎస్సార్ నగర్‌లో వారం రోజులుగా మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పొంగుతోంది. 9వ బ్లాక్ వద్ద ఈ ప్రదేశంలో పొంగుతున్న మురుగు కారణంగా చుట్టుపక్కల నివాసం ఉంటున్న ఇళ్లలో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికే స్థానికులు స్థానిక సచివాలయంతో పాటు జోనల్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా పారిశుద్ధ్య విభాగం స్పందించి దుర్గంధం నుంచి ఉపశమనం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ చిక్కాల నాయుడు తోట వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే పంచాయతీకి చెందిన మజ్జి అప్పలరాజు అనే వ్యక్తి మృతి చెందాడు. తర్లువాడ నుంచి బాకూరుపాలెం రహదారిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మృతుడు మరో వాహనానికి దారి ఇవ్వబోయి రోడ్డుపై పడిపోయినట్లు పోలీసులు తెలిపారు. తలకు బలమైన గాయమై, తీవ్రంగా రక్తస్రావం కావడంతో వెంటనే నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అప్పలరాజు హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ పనులు చేస్తుంటాడు. శుక్రవారమే స్వగ్రామానికి వచ్చి, మరుసటి రోజే మృతి చెందడం తర్లువాడ వాసులను కలచివేసింది. ప్రమాదం జరిగిన సమయంలో మృతుడు మరో మహిళకు లిఫ్ట్ ఇవ్వగా ఆమె కూడా గాయపడింది. మృతుడికి భార్య అచ్చయ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలలో ఒకరికి వివాహం అయింది. ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అప్పలరాజు (ఫైల్)

సంత తరలింపుపై వ్యాపారుల ప్రతిఘటన

- రోడ్డుపై బైఠాయించిన వ్యాపారులు
- తోక ముడిచిన అధికారులు

మధురవాడ: మధురవాడ జోనల్ ఆఫీసు పరిసర ప్రాంతాల్లోని హైవే సర్వీసు రోడ్డులో నిర్వహిస్తున్న వారపు సంతను కొమ్మాది రోడ్డులోకి తరలించే చర్యలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇక్కడ శనివారం వారపుసంత నిర్వహించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు రావడంతో, వేరే ప్రాంతానికి తరలించాలని చాలాకాలంగా ప్రతిపాదనలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం కూడా సంత తరలింపునకు చర్యలు చేపట్టారు. దీంతో వ్యాపారులు సీఐటీయూ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి, పెద్ద ఎత్తుననినాదాలు చేశారు. వ్యాపారుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో అధికార యంత్రాంగం వెనుతిరిగింది. యథావిధిగా సంత జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.అప్పలరాజు, జి.కిరణ్, వ్యాపారుల సంఘం నాయకులు టి.అప్పారావు, వెంకటరమణ, శంకరరావు, ఎస్‌కే మస్తాన్, దుర్గ, ఫాతిమా, అరుణ, నరసింగరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై బైఠాయించిన వ్యాపారులు

ముగిసిన ఇండోర్ గేమ్స్



క్యారమ్స్, చెస్ ఆడుతున్న విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీలో రెండు రోజుల పాటు జరిగిన ఇండోర్ ఇంట్రా మ్యూరల్ స్పోర్ట్స్ శనివారం ముగిశాయి. టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ పోటీలకు వివిధ కళాశాలల నుంచి 380 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎస్.ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బరాజు, ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఖాళీల భర్తీ

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడానికి విద్యార్థులకు అవకాశం కల్పించనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల శనివారం తెలిపారు. ఇక్కడ మొత్తం 69 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. బీఏ హిస్టరీలో 17 సీట్లు, బీఏ పాలిటిక్స్‌లో 12, బీకాం కంప్యూటర్స్‌లో 11, బీఎస్సీ ఫిజిక్స్‌లో 10, బీఎస్సీ కెమిస్ట్రీలో 7, బీఎస్సీ జువాలజీలో 12 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆయా విభాగాల్లో చేరడానికి అవకాశం ఉందని తెలియజేశారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సముద్ర జీవుల రక్షణకు కృషి

కొమ్మాది: సముద్రంలో కాలుష్యం వలన, రాళ్లు తగిలి, వలలకు చిక్కుకుని గాయాలపాలైన సముద్ర జీవులను రక్షించడమే తమ ప్రధాన లక్ష్యమని గ్రీన్ పాస్ ప్రతినిధులు తెలిపారు. శనివారం సాయంత్రం టైడ్‌పూల్ వాక్ పేరుతో రుషి కొండ బీచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సముద్ర జీవులను రక్షించడంలో తమ సంస్థ ముందుంటుందని తెలిపారు. సముద్రంలో ఉండే ప్రమాదకర పదార్థాలను, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను నిరంతరం తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రీన్ పాస్ ప్రతినిధులు నమిత, వివేక్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



రుషికొండ బీచ్‌లో సముద్ర జీవులను పరిశీలిస్తున్న గ్రీన్ పాస్ ప్రతినిధులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: దసరా సంబరాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో శనివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. నగరంలోని శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యాలయంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు కూచిపూడి నృత్య విన్యాసాలతో ఆకట్టుకున్నారు. మహా గణపతిం మనసా స్మరామి నృత్యాంశంతో ఈ కార్యక్రమం ప్రారంభం కాగా లోకమాతను స్తుతిస్తూ సాగిన అయిగిరి నందిని నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారులు లిఖిత, నక్షిత, సాన్వి, చిన్మయి, యశ్విత, మోక్షిత, హాస్య, సౌజన్య తదితర కళాకారులు పాల్గొనగా సీహెచ్ మోహన లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక పరిపాలనాధికారి టి.విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.



శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

అవంతిలో ఘనంగా దసరా వేడుకలు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు శనివారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా వస్త్రాలు ధరించారు. ముందుగా దేవీపూజ చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యార్థినులు నవదుర్గల అలంకరణలో ఆకట్టుకున్నారు. రంగోలి, దాండియా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులకు బహుమతులు అందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ షరీఫ్ పండగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.



నవదుర్గల అలంకరణలో విద్యార్థినులు

23న ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట: ఎట్టకేలకు ఏపీ నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల అధికారిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని నియమించింది. మూడు సంఘాల మధ్య విబేధాలు కారణంగా నాలుగేళ్లుగా ఎన్నికలు జరగలేదు. దీంతో సభ్యుల వినతి మేరకు మూడు గ్రూపులతో శ్రీనివాసరెడ్డి సమావేశాలు నిర్వహించిన అనంతరం ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. 8న ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 14న తుది ఓటర్ల జాబితాతో పాటు.. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు. జిల్లాకు సంబంధించి కో–ఆపరేటివ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రర్ బి.శ్రీనివాస్‌ను ఎన్నికల అధికారిగా నియమించారు. ఏపీ నర్సింగ్ అసోసియేషన్ జిల్లాలో పోటీ చేసేందుకు సభ్యులు విధిగా ఇప్పటికే ఐదేళ్లు పాటు సభ్యత్వం చెల్లించిన వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ ఎన్నికలకు సంబంధించి 16న నామినేషన్లు, 17న పరిశీలన, 18న ఉపసంహరణ, 23న ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు.

ఆ గ్రంథాలయానికి స్వీపరే దిక్కు



తాళం వేసి ఉన్న పుస్తకాల గది



పద్మనాభం శాఖా గ్రంథాలయం



గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగులు

పద్మనాభం: పద్మనాభం శాఖా గ్రంథాలయం నాలుగు నెలలుగా స్వీపర్ పర్యవేక్షణలోనే నడుస్తోంది. పుస్తకాలు సరిగ్గా అందుబాటులో లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో 22 పంచాయతీలు ఉన్నా పద్మనాభంలో మాత్రమే గ్రంథాలయం ఉంది. రెడ్డిపల్లి, రేవిడి గ్రామాల్లో బుక్ డిపాజిట్ సెంటర్లు ఉన్నా..పేపర్లు మాత్రమే వస్తాయి. 15 రోజులకోసారి నవలలకు సంబంధించి 15 పుస్తకాలను మాత్రం శాఖా గ్రంథాలయం నుంచి సరఫరా చేస్తారు. పోటీ పరీక్షల పుస్తకాలు సరఫరా చేయరు. ఈ పంచాయతీలన్నింటికి పద్మనాభం గ్రామంలోనే గ్రంథాలయం ఉంది. ఈ గ్రంథాలయంలో సుమారు ఏడు వేల పుస్తకాలు ఉన్నాయి. వీటిలో 1500 కాంపిటీటివ్ పుస్తకాలు, మిగతావి నవలలు. ఐదు దిన పత్రికలు వస్తాయి.

మండలానికి ఒకే గ్రంథాలయం కావడంతో పాఠకులు, చందాదారులు, నిరుద్యోగులు ఎక్కువగా వస్తుంటారు. గ్రంథాలయానికి నిరుద్యోగులు వచ్చి పోలీస్, గ్రూపు–2 పోస్టులకు, డీఎస్సీకి ప్రిపేర్ అవుతుంటారు. ఇక్కడ పనిచేసే లైబ్రేరియన్ మే నెలలో రిటైరయ్యారు. అప్పటి నుంచి ఈ గ్రంథాలయానికి పూర్తిస్థాయి లైబ్రేరియన్ లేకపోవడంతో వారానికోసారి (బుధవారం) మాత్రమే ఆనందపురం లైబ్రేరియన్ పద్మనాభం శాఖా గ్రంథాలయానికి వస్తారు. మిగతా రోజుల్లో స్వీపర్ పర్యవేక్షణలోనే గ్రంథాలయం నడుస్తుంది. లైబ్రేరియన్ వచ్చినప్పుడు మాత్రమే చందాదారులు తమకు కావలసిన నవలలు, నిరుద్యోగులు అవసరమైన కాంపిటీటివ్ పుస్తకాలు తీసుకుంటారు. మిగతా రోజుల్లో లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాల గదికి తాళం వేస్తారు. దీని వల్ల నవలల కోసం వచ్చే చందాదారులు తీసుకోవడానికి వీలులేక పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవడానికి పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. గ్రంథాలయానికి పూర్తిస్థాయి గ్రంథాలయాధికారిని నియమించాలని వారంతా కోరుతున్నారు.

పూర్తిస్థాయి లైబ్రేరియన్‌ను నియమించాలి



గ్రంథాలయంలో పని చేసే లైబ్రేరియన్ మే నెలలో రిటైరయ్యారు. నాలుగు నెలలు పూర్తయినా ఇప్పటికీ పూర్తిస్థాయి లైబ్రేరియన్‌ను నియమించలేదు. వారానికోసారి ఇన్‌చార్జి లైబ్రేరియన్ వచ్చినప్పుడే కావలసిన పుస్తకాలు తీసుకోవలసి వస్తోంది. మిగిలిన రోజుల్లో వేరే పుస్తకాలు రిఫర్ చేద్దామన్నా అందుబాటులో ఉండటం లేదు. పూర్తి స్థాయి లైబ్రేరియన్‌ను నియమించాలి.

– డి.మోహన్, నిరుద్యోగి

అవసరమైన పుస్తకాలు తీసుకోలేకపోతున్నాం



నేను గ్రూప్–2 కోసం ప్రిపేర్ అవుతున్నాను. రోజూ లైబ్రరీకి వస్తాను. ఇక్కడ అన్ని రోజులు లైబ్రేరియన్ అందుబాటులో లేక పుస్తకాల గదికి తాళం వేసి ఉంటుంది. దీంతో అవసరమైనప్పుడు పుస్తకాలు తీసుకుని చదువుకోవడం వీలు కావట్లేదు. చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ ఇదే లైబ్రరీ. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పూర్తిస్థాయి లైబ్రేరియన్‌ను నియమించాలి.

– జి.రఘు, నిరుద్యోగి

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

బీచ్‌రోడ్డు: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి హెచ్చరించారు. ఏయూ అంతర్జాతీయ హాస్టల్స్ విద్యార్థులకు ర్యాగింగ్, గంజాయిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.గంజాయి అలవాటు చేసుకొని జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. శ్రద్ధగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.